రాబడి

మార్కెట్ పల్స్

ద్రవ్యసమీక్షపైనే..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



మదుపుతోనే గెలుపు





నేడు మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్లైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

రోజులు మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

క్రిప్టో సిప్స్

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికీ ఇవి దోహదం చేయగలవు.

గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.

రోడ్డు ప్రమాదంలో సీనియర్ పీడీ కడారి రవి మృతి

- విషాదంలో ఉమ్మడి జిల్లా క్రీడారంగం

కడారి రవి (ఫైల్)

కొత్తపల్లి, జూన్ 1: కరీంనగర్‌కు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్, జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కడారి రవి (57) కొమురవెల్లి సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించాడు. ఉమ్మడి జిల్లా క్రీడారంగంలో సౌమ్యుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పరచుకున్న రవి, రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తీవ్ర విషాదం నెలకొంది. హైదరాబాద్‌లో వ్యాయామ వృత్తి విద్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో పాటు జింఖాన గ్రౌండ్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు హాజరయ్యేందుకు తోటి మిత్రుడితో కలిసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న కారు టైరు పేలి పోవడంతో అదుపుతప్పి పక్కనే డివైడర్‌కు బలంగా ఢీకొనడంతో డ్రైవింగ్ చేస్తున్న రవికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సిద్దిపేట దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రవికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య గృహిణి కాగా, కుమారుడు మైకేల్ హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఉమ్మడి జిల్లా అథ్లెటిక్ క్రీడాకారుడిగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు కైవసం చేసుకొని రాష్ట్ర క్రీడా పతాకాన్ని ఇనుమడింపజేశారు. ఎందరినో వ్యాయామ విద్య ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ వ్యాయామ విద్య ఉపాధ్యాయుడిగా 2002 మే 31న శనిగరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉద్యోగంలో చేరిన రవి, అక్కడి నుంచి దాచారానికి బదిలీ అయ్యారు. అనంతరం 2013లో ఫిజికల్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొంది జమ్మికుంట పాఠశాలలో చేరారు. అక్కడి నుంచి జంగపల్లికి, తదనంతరం 317 జీవో ప్రకారం పెద్దపల్లి జడ్పీహెచ్ఎస్ (బాలుర)కు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా అథ్లెటిక్ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా, వ్యాయామ విద్య ఉపాధ్యాయ రిసోర్స్ పర్సన్‌గా కొనసాగుతున్న రవి, గతంలో ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శిగా, పెటా సంఘం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర బాధ్యుడిగా వివిధ హోదాల్లో పని చేసి అరుదైన ఘనతను దక్కించుకున్నారు. రవి మృతికి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీవైఎస్‌వోలు శ్రీనివాస్‌గౌడ్, సురేశ్, రాందాస్, రవి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి, మహ్మద్ కరీం, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పీఈటీల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు అంతటి శంకరయ్య, శ్రీనివాస్, బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, వేల్పుల సురేందర్, దాసరి రమేశ్, పలు క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు సంతాపం తెలిపారు.

'మినీ స్టేడియం రాకుండా కాంగ్రెస్ కుట్ర'

హుజూరాబాద్ టౌన్, జూన్ 1: క్రీడాకారులకు, ప్రజలకు ఎంతో ఉపయోగపడే మినీ స్టేడియం హుజూరాబాద్‌కు రాకుండా కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తున్నదని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు కొలిపాక సమ్మయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా, విప్‌గా పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారుల భవిష్యత్తు కోసం మినీ స్టేడియం నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరు చేయించారని, పనులు ప్రారంభించి కొంత నిర్మాణం కూడా జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం మారడంతో కౌశిక్ రెడ్డికి పేరు రావద్దనే ఉద్దేశంతో కాంట్రాక్టరుకు బిల్లులు రాకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారన్నారు. బిల్లులు రాక కాంట్రాక్టర్ మిగతా పనులు చేయకుండా ఆపారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి ఇష్టం లేని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రూ. 10 లక్షలతో వాకర్స్ ట్రాక్ ఏర్పాటు చేసి మినీ స్టేడియం ఏర్పాటును అడ్డుకునే కుట్రలు చేస్తున్నారన్నారు. అలాగే అధికారిక కార్యక్రమాల్లో ప్రభుత్వ పదవులు లేని వారిని అధికారులు ఎలా అనుమతిస్తారని, మరోసారి ఇలా జరిగితే అనుమతించిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్‌కే పట్టం కడతారని సమ్మయ్య ధీమా వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

కరీంనగర్ రూరల్, జూన్ 1: మండలంలోని చేగుర్తి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్ మండలం చేగుర్తి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

విచారణకు నెలలు.. చర్యలకు ఎన్నేళ్లు?

- 'నాగంపేట' కార్యదర్శుల వ్యవహారంలో అధికారుల ఉదాసీన వైఖరిపై సర్వత్రా విమర్శలు
- కలెక్టర్ దృష్టికి జీపీ సెక్రటరీల భాగోతాలు

జమ్మికుంట, జూన్ 1: గ్రామాల్లో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు తమ విధులను నిబంధనలు విరుద్ధంగా నిర్వహించడం, ఫిర్యాదులొచ్చినా సదరు కార్యదర్శులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని నాగంపేట గ్రామానికి సంబంధించిన పలు విషయాలపై ఓ వ్యక్తి ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా.. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శి కాకుండా గతంలో ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన కార్యదర్శి లిఖిత పూర్వక సమాచారం ఇవ్వడం చర్చనీయాంశమైంది. జరిగిన తతంగంపై అధికారులకు ఫిర్యాదులు చేయగా, నెలల పాటు విచారణ చేశారని.. మరి చర్యలు ఎన్నేళ్లకు తీసుకుంటారు.? అనే ప్రశ్నలు వినవస్తున్నాయి. కాగా, కార్యదర్శుల బాగోతాలు జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

ఏం జరిగిందంటే..

నాగంపేట జీపీ కార్యదర్శిగా శ్రీనివాస్ పనిచేశాడు. గత జూలైలో ఇల్లందకుంట మండలం సిరిసేడుకు బదిలీపై వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న అంకూసు నాగంపేట కార్యదర్శిగా విధుల్లో చేరాడు. నాగేశ్వర్ రావు అనే వ్యక్తి జీపీకి వచ్చిన నిధులు, ఖర్చులు, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సమాచార హక్కు చట్టం అర్జీ పెట్టాడు. నెలలు గడిచినా సమాధానం రాకపోగా, ఉన్నతాధికారులకు అర్జీదారు ఫిర్యాదు చేశాడు. దీంతో సమాచారం ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే దరఖాస్తుదారుకు అంకూసు సమాధానం ఇవ్వాల్సి ఉండగా, బదిలీపై వెళ్లిన శ్రీనివాస్ తానే కార్యదర్శిగా లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ విషయాన్ని బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

చర్యలకు ససేమిరా.....?

'కార్యదర్శి ఒకరు.. సమాధానం మరొకరిది' కార్యదర్శుల బాగోతాన్ని 'నమస్తే' గత డిసెంబర్ 18న వెలుగులోకి తెచ్చింది. వరుస కథనాలు.. ఫిర్యాదుల నేపథ్యంలో ఎట్టకేలకు స్పందించిన అధికారులు విచారణకు వచ్చారు. ఆర్టీఐ అర్జీ నిజమే.. విధుల్లో కార్యదర్శికి బదులు బదిలీ కార్యదర్శి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చింది నిజమే.. ఇది అధికారులిచ్చిన నివేదిక. ఏం జరుగుందో ఏమో తెలియదు కానీ, కార్యదర్శులపై చర్యలకు మాత్రం ససేమిరా అంటున్నారు. చర్యలపై ప్రశ్నిస్తే విచారణ సా..గుతూనే ఉందనే సమాధానాలు వస్తున్నాయి. అయితే కార్యదర్శులకు అండగా మండలస్థాయి అధికారి ఉన్నారని, ఆరోపణలున్న అధికారితో పాటు కార్యదర్శులపై ఏకకాలంలో చర్యలు తీసుకోవాలనే డిమాండ్లున్నాయి.

కరెంట్ లేక.. తాగునీరు రాక

- నాలుగు రోజులుగా దేశరాజ్‌పల్లి గ్రామస్తుల ఇబ్బందులు

దేశరాజ్‌పల్లిలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రామడుగు, జూన్ 1 : నాలుగు రోజులుగా కరెంటు లేకపోవడం, గుక్కెడు మంచి నీరు అందకపోవడంతో గ్రామప్రజలు ఇబ్బందులకు గురై చివరకు రోడ్డెక్కిన ఘటన రామడుగు మండలం దేశరాజ్‌పల్లిలో జరిగింది. మండలంలోని దేశరాజ్‌పల్లిలో గత నెల 29న మధ్యాహ్నం గాలివానకు స్థానిక రైల్వేగేటు సమీపంలోని లింగయ్యకుంట వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాలుగు రోజులు గడిచినా మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామంలోని రైల్వేగేటు వద్ద ఉన్న మంచినీటి బావి, ఊరచెరువు కట్ట వద్ద మంచినీటి బావితో పాటు పంచాయతీ పరిధిలోని రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు పనిచేయక సుమారు సగం మంది గ్రామస్తులు తాగునీటికి విలవిలలాడుతున్నారు. కరెంటు లేకపోవడంతో గ్రామంలోని చేనేత కార్మికుల పవర్‌లూమ్‌లు ఆగిపోయాయి. నాలుగు రోజులుగా కరెంటు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలు రోడ్డెక్కి నిరసన తెలిపారు. కాగా, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సిబ్బంది ఆదివారం మరమ్మతు చేసినా సరఫరా పునరుద్ధరించకపోవడంతో గ్రామస్తులు మరింత ఆగ్రహానికి లోనయ్యారు. కాగా ప్రజా ప్రభుత్వంలో జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామాల పరిస్థితి ఇంత దుర్భరంగా ఉంటే, మారుమూల ప్రాంతాల ప్రజల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివిద్దాం

గంభీరావుపేట, జూన్ 1: నర్మాల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆదివారం గ్రామస్తులు ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. గ్రామంలో అర్హత గల విద్యార్థులందరినీ సమష్టి కృషితో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుందామన్నారు. గ్రామంలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అజ య్, రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

రుద్రంగి, జూన్ 1: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని ఎస్ఐ అశోక్ పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని స్కూల్‌లో సమ్మర్ క్యాంప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్రంగి, చందుర్తి మండలాల వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు ఏఎంసీ చెర్మన్ చెలుకల తిరుపతి, నాయకులతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గంగం మహేశ్, సీనియర్ క్రీడాకారులు కర్ణవత్తుల చందు, తిగుల శ్రీనివాస్, దేశవేని శ్రీనివాస్, దయ్యాల శ్రీను, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు పోలీసులకు పతకాలు

పీటీసీ ఎస్ఐ నసీమోద్దీన్

ఎస్ఐ ఎస్‌బీ శ్రీనివాస్

ఏఆర్ఎస్ఐ రాంప్రసాద్

హెడ్ కానిస్టేబుల్ విజయసాగర్

కరీంనగర్, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు ఉత్తమ సేవా, సేవా పతకాలు దక్కాయి. కరీంనగర్ పోలీసు కమిషనర్ వీరిని అభినందించారు. ఉత్తమ సేవా పతకాలకు ఎస్ఐ ఎన్ శ్రీనివాస్ (సీఎస్‌బీ), ఏఎస్ఐ సీహెచ్ రాజన్న (ట్రాఫిక్ కరీంనగర్), కరీంనగర్ టూటౌన్ ఏఎస్ఐ ఎన్ భాస్కరాచారి, కరీంనగర్ ట్రాఫిక్ పీఎస్ ఏఎస్ఐ డీ శ్రీనివాస్, కరీంనగర్ రూరల్ పీఎస్ సయ్యద్ అమ్జద్, చిగురుమామిడి ఏఎస్ఐ తిరుపతి, వీణవంక ఏఎస్ఐ పీ రవి, కరీంనగర్ ఏఆర్ ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖుద్దూస్, హెడ్ కానిస్టేబుళ్లు వీ రాజయ్య (టూ టౌన్ కరీంనగర్), ఎడ్ల విజయ సాగర్ (టాస్క్‌ఫోర్స్ కరీంనగర్) ఎంపికయ్యారు. అలాగే సేవా పతకాలకు ఎస్ఐలు జీ రాంరెడ్డి (పీసీఆర్ కరీంనగర్), ఆర్ రవీందర్ రెడ్డి (ఎల్ఎండీ కాలనీ), ఎండీ మోయిడ్ అలీ ((త్రీటౌన్ కరీంనగర్), ఎం కంఠయ్య (ఏఆర్ఎస్ కరీంనగర్), సీహెచ్ శ్రీనివాస్ (మహిళా పీఎస్ కరీంనగర్), ఎండీ ఇక్బాల్ (ఏఆర్ఎస్ఐ కరీంనగర్), ఏ శంకరయ్య (ఏఆర్ఎస్ఐ కరీంనగర్), ఎం సుధాకర్ (శంకరపట్నం), ఎండీ నజీముద్దీన్ (వన్ టౌన్ కరీంనగర్), పీ లక్ష్మీనారాయణ (గన్నేరువరం), పీ రాంరెడ్డి (ఏఆర్ఎస్ఐ కరీంనగర్), ఎం సత్తయ్య (రామడుగు), ఎం రాయ్‌బోస్ (ఏఆర్ఎస్ఐ కరీంనగర్), పీ రాంప్రసాద్ (ఏఆర్ఎస్ఐ కరీంనగర్), ఎండీ బాషు (ఏఆర్ఎస్ఐ కరీంనగర్), ఎన్ శ్రీనివాసా చారి (ఏఆర్ఎస్ఐ కరీంనగర్), అలాగే హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ ఖాజా పాషా (టూ టౌన్ కరీంనగర్), ఏ రవీందర్ (సీటీసీ కరీంనగర్), ఏ రేణుకానందం (కరీంనగర్ రూరల్), డీ మల్లేశం (మహిళా పీఎస్), వీ బాలరాజు (ఏఆర్ కరీంనగర్), వీ మల్లారెడ్డి (సీఎస్‌బీ), కే కరుణాకర్ (వన్ టౌన్), పీ శ్రీనివాస్ (వీణవంక), ఎండీ బాగ్దాద్ (మానకొండూర్), బీ గౌరయ్య (సైదాపూర్), ఆర్ మొగిలయ్య (మానకొండూర్), ఎన్ సంపత్ (సైదాపూర్), సయ్యద్ గయాజొద్దీన్ (ట్రాఫిక్ కరీంనగర్), ఈ వేణు (పీఆర్సీ, కరీంనగర్), డీ రవీందర్ (టాస్క్‌ఫోర్స్ కరీంనగర్), ఎం స్వామి రావు (ట్రాఫిక్ కరీంనగర్) ఎంపికయ్యారు.

రెండో వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి

డీఐఈవోకు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ బాధ్యులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 1: ప్రభుత్వ జూనియర్ కళాశాలల నూతన అధ్యాపకులకు 2వ వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరుతూ డీఐఈవో గంగాధర్‌కు ఆదివారం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ బాధ్యులు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను జీవో 16 ప్రకారం క్రమబద్ధీకరించారని, 2023 మే 3న సుమారు 3200 మంది రెగ్యులర్ లెక్చరర్స్‌గా విధులు నిర్వహిస్తు మొదటి వార్షిక ఇంక్రిమెంట్ తీసుకున్నారని పేర్కొన్నారు. ఎ